


# మిల్లులోని మిషను

'సుందరీ! సుందరీ!' – వీధినికొంప అంటుకున్నాయేమో అన్నంత కంగారుగా పిలిచాడు సారంగపాణి.

'ఏమండీ?' అన్నది త్రిపురసుందరి.

"'ఏమండీ' అంటూ నిలబడిపోతే ఎలాగ? మిల్లుకి టైము ఐపోయింది; త్వరగా వడ్డించు."

'ఇందుకేనా పిలుస్తే? ఏమిటో అనుకున్నాను!'

ఆమె వెంటవెంటనే వడ్డించింది. ఆతడు గబగబా ముద్దలు నమలకుండానే మింగేసి లేచాడు.

'అయ్యో, కొబ్బరికోరుతో పెరుగు పచ్చడి చేశాను; మతిమరుపు దాన్ని, వడ్డించడం మరిచి పోయాను మీ తొందరలో!'

'మునిగిపోయిన దేమీ లేదులే, ఆ పచ్చడి తినకపోతే!'

'మీకు లేచింది మొదలు ఒకటే హడావుడి కదా కర్మం! చేసుకున్న దేదో తినకుండా పరుగెత్తుతూంటారు. ఇంతకీ కంగారే కాని, మిల్లుకి టైము అవనే లేదు.'

'నేను ఫోర్‌మన్నుని కదా. ఒనిముషం ముందే వెళ్లాలి కాని ఆలస్యంగా వెళ్లకూడదు మిల్లుకి' అంటూ పరుగెత్తాడు.

'ఒక నిమిషం' అన్నాడు కాని సారంగపాణి మిల్లు ఆవరణలో పదిహేను నిముషాలు ముందుగా ప్రవేశించాడు. వెంటనే, 'రఘురాం, రఘురాం' అని పిలిచాడు.

'ఇంకా ఎవరూ రాలేదండీ' అన్నాడు వాచ్‌మెను.

సారంగపాణి గోడగడియారం కేసి చూశాడు. గడియారం ఆగలేదుకదా!

పాలంకి వెంకట రామచంద్రమూర్తి

ఏడేసి నిముషాల కొకసారి రఘురాం, రఘురాం' అని పిలుస్తోనే ఉన్నాడు సారంగపాణి.

తుదకు అసిస్టెంట్ ఫోర్‌మన్ రఘురాం వచ్చి, 'నమస్కారమండీ' అన్నాడు.

"'నమస్కార'మంటూ నిలబడిపోతే ఎలాగోయ్? ఈ సాయంకాలానికి మనం ఐదువందల బేళ్ల మల్లుగుడ్డ తయారు చేసి సప్లై చెయ్యాలి కదూ."


'చేసేద్దామండి. మిషన్లు స్టార్టవుతే ఎంతసేపండీ?'

'స్టార్టు చేయించు మరి వెళ్లి.'

రఘురాం వెళ్లి రెండు నిముషాలైందోలేదో కాని సారంగపాణికి రెండుయుగాలుగా తోచింది. ఆ మిషన్ల శబ్దం ఎంతకీ వినిపించదేమిటి? 'రఘురాం, రఘురాం.'

'ఫోర్‌మన్‌గారు పిలుస్తున్నారండీ' అన్నాడు వాచ్‌మెను. ఇంజను డ్రైవరు నవ్వుతూ, 'పిలవనివ్వవోయ్. ఈ విధంగానైనా ఆయనకి రామనామస్మరణముచేసిన పుణ్యం అయినా వస్తుంది!' అన్నాడు.

'బాబ్బాబు, నీకు పుణ్యముంటుంది! వెంటనే స్టార్టుచెయ్యి. లేకపోతే ఆయ నిక్కడికి పరుగెత్తి వస్తాడు!' అని బ్రతిమాలేడు రఘురాం.



'ఆయనకిమల్లే మీరుకూడాకంగారు పడితే ఎలా మిస్టర్ ? టైమవందే ఇంకా. మగ్గాలవద్ద పనివాళ్లు రెడీ కావద్దూ ? ఉత్తినే ఎలక్ట్రిసిటీ ఖర్చు చెయ్యడం దేనికి ?'

'నిజమేలే. కాని ఫోర్మన్‌గారు మిషన్లకన్నా వేగంగా ఉరకలూ పరుగులూ పెడుతున్నారు! అందు కోసం చెప్పేను' అన్నాడు రఘురాం.

## 2

మల్లుగుడ్డ ఎన్నిబేళ్లు తయారైందో ఇంకా ఎన్నిబేళ్లు కావాలో గంట గంటకీ సారంగపాణి లెక్క వేసుకుంటూనే ఉన్నాడు.

నాలుగు గంటలు పనిచేసి మిషన్లు ఆగిపోయాయి. విరామ కాలంలో కార్మికు లంతా బయటకు వెళ్లేరు.

సారంగపాణికి కూడా ఇంటిదగ్గర్నుంచి టిఫిను వచ్చింది. కాని ఆయన తయారైన మల్లుగుడ్డను పరిశీలిస్తూ ఉండిపోయి తన గదికే రాలేదు.

'మీ కోసం ఎవరో వచ్చారు సార్.'

'నా రూములో కూర్చోమను, వస్తున్నా.'

ఆ వచ్చిన పెద్దమనిషి ఇరవైనిముషాలు కనిపెట్టు క్కూర్చున్నాకగాని సారంగపాణి తన గదికి వెళ్లలేకపోయాడు.

'ఒహో, నువ్వేనా బావా? ఎవరో అనుకున్నాను' అన్నాడుసారంగపాణి.

" 'నేను' అనితెలిస్తే ఇంకో పావు గంటకికాని రాకపోయేవాడి వనుకుంటూ...ఔను కాని బావా, టిఫిను కూడా తినకుండా పనేమిటోయ్ ? మిషన్లకే విశ్రాంతి అవసరమైనప్పుడు మానవుడికి అక్కర్లేదుటోయ్ ?"

'విశ్రాంతి కాక ఏముందోయ్ ? బట్ట తయారు సరిగా ఉందో లేదో చూస్తున్నానంతే. ఏమాత్రం హెచ్చు తగ్గున్నా మిల్లు పేరు చెడిపోతుంది చూడూ' అంటూ ఫోర్మను టిఫిను బాక్సు తెరిచాడు.

అది ఖాళీగా ఉండటం చూసి, 'తినేసే వెళ్లేవన్నమాట !' అన్నాడు సారంగపాణి.

చిరునవ్వుతో తిలకిస్తోన్న బావ సానుభూతికనపరుస్తూ, 'అరి నీ మందమరుపు బంగారంగానూ. తినకుండానే తినేశావనుకుంటున్నా వేమిటి ?' అన్నాడు.

'ఇందులో టిఫి నేమైంది మరి ? నువ్వు తిన్నావా ఐతే ?'

'ఇక్కడ ఇంతస్సేపూ నీ కోసం ఊరికే పడిగాపులు పడి ఉన్నానా మరి ?....ఉండు; నీకు టిఫిను తెమ్మని బంట్రోతును పంపేను....'

'ఎప్పుడొచ్చావు నువ్వు ? ఇంటికి వెళ్లేవా ?'



'లేదు. చెల్లాయిని చూసి అలా రైలుకి పోతాను. నిన్ను చూడ్డం పడదని ముందే ఇక్కడి కొచ్చాను.'

అంతలో గంట కొట్టేరు. కార్మికులు గబగబా చొరబడ్డారు.

'రఘురాం, రఘురాం' అని పిలిచాడు సారంగపాణి. ఆ అసిస్టెంటుతో ఆయ నేదో చెపుతోనే ఉన్నాడు. మిషన్లు 'స్టార్ట్' అయాయి. మళ్లీ, సుందరమ్మ అన్నగారు ఇక అక్కడ ఆగలేకపోయాడు.

'వెడతానోయ్ బావా.'

'వెడతావా ?' అంటూ సారంగపాణి రఘురాం వైపుతిరిగి, 'ఒక బేలు సరిగ్గాలేదు. దాన్ని విడిగా తీసిపెట్టేను. తక్కిన వాటితో కలవనివ్వకు' అన్నాడు. బావమరిది నిష్క్రమణను ఆయన గమనించినట్టు లేదు.

సాయంత్రం నాలుగూనలభై ఐంది. 'రఘురాం, రఘురాం.'

'ఏం సార్ ?'

'ఎవరినీ వెళ్లిపోవద్దను. ఈ రాత్రికి ఐదువందుల బేళ్లూ తయారవకతప్పదు. ఓవర్‌టైం జీతం ఇచ్చి చేయించెయ్యాలి.'

'అలాగే నండీ.'

మిషన్లు పని చేస్తూనే ఉన్నాయి. ఆరుగంట లయేసరికి రఘురాం వచ్చి, సారంగపాణిని సంతోషపెడదామనే ఉద్దేశంతో 'మీరు వెడితే వెళ్లండి సార్. నేను పని పూర్తి చేయించి వస్తాను' అన్నాడు.

'నాకు తొందరేమొచ్చిందోయ్ ? కుర్రవాడివి, పూచీ అంతా నీ మీద వదిలెయ్యడం న్యాయంకాదు' అనేసాడు సారంగపాణి.

## 3

ఐదువందలబేళ్లూ తయారై, వాటిని తాను స్వయంగా పరిశీలించడం జరిగేకనే సారంగపాణి ఇంటికి చేరుకున్నాడు.

'ఏమండీ, ఇంతరాత్రి దాకా ఏం చేస్తున్నారు? రోజూ ఇలాగ మిల్లులోనే ఉండిపోయి నడుం వంచకుండా పని



మెజిషియన్ : ఇంకా ఏమిచెయ్యమంటారో చెప్పండి.

ఒక ప్రేక్షకుడు : మీ నెత్తిన జుట్టు మొలిపించండి.

చేస్తే ఆరోగ్యం చెడిపోతుందన్నాడు మా అన్నయ్య. డాక్ట రేమన్నాడో తెలుసా ?' అంది సుందరమ్మ.

'డాక్ట రేమంటాడు ? శలవు పెట్టి ఇంట్లో కూచోమంటాడు. అంతేగా ?' అనేశాడు సారంగపాణి.

'ఎందుకండీ అంత వెటకారం ? తన కోసం చెపుతాడా ఏమిటి డాక్టరు ? డాక్ట రొక్కడేనా ? రఘురాంకూడా అన్నాడు.'

'రఘురామా ? నేను శలవు పెడితే తనకు ప్రమోష నొస్తుందికదా అని చూస్తున్నాడు !'

'అదే అనుకోండి పోనీ. మీ చేతి క్రింద ఇన్నాళ్లూ పని చేసినవాడికి ఆ మాత్రం ఉపకారం జరగకూడదా?' అంది సుందరమ్మ తువ్వాలు అందిస్తో.

'అబ్బే, జరక్కూడ దని కాదు.'

'ఇంతకూ బోలెడు శలవుంది మీకు. ఏం చేసుకుంటా రదంతా ?' అంటూ విస్తట్లో వడ్డన ప్రారంభించింది.

'శల వుచ్చుకు ఏమిచెయ్యనూఅని?' అసలుసమస్యను బయటపెట్టాడాయన.

'చెయ్యడాని కేముందండీ? హాయిగా సరదాగా యాత్రల పేరు చెప్పుకుని సింహాచలం, తిరుపతీ తిరిగొద్దాం ఓసారి. అన్నట్టు ఈ మధ్య శ్రీశైలానికి చక్కగా బస్సు వెళ్లటానికి రోడ్డు వేశారటగా ?'

'నీ కెవరు చెప్పేరప్పుడే ఆసంగతి?'

'ఒకరు చెప్పే దేమిటండీ ? దినపత్రికలలో పడిందిగా ? మిల్లు పనిలో మునిగిపోయి మీరు మానేశారుగాని నేను పత్రికలు చదువుతోనే ఉన్నాను.'

'తీరిక లేకగాని నేను మాత్రం చదవనూ ?'

'తీరిక ఉండటానికి మీరు ఆమిల్లులోంచి ఇవతలకు ఊడిపడితేగా ? నా మాట విని మీరు రేపటినుంచే ఒక నెల శలవు పెట్టండి. తర్వాత ఇంకా కావలసొస్తే పొడిగిద్దురుగాని' అంది ఆమె పెరుగు వడ్డిస్తో.

'నెల్లాళ్లే ఏకంగా ? ఏం చేసుకుందామని ?'

'మళ్లీ మొదటి కొచ్చారా ? ఏం చెయ్యాలో నేను చెపుతాగా ? శలవు పెట్టండి.'

'సరే ఐతే. రేపు వెళ్లి కాగితం ఇచ్చి వస్తాను.'

'అలా కాదు. మిల్లుకి వెడితే శలవు మాట మీకు జ్ఞాపకం ఉండదు. ఉన్నా, బుద్ధి మారిపోవచ్చు. ఇంటివద్దనే రాసి పంపెయ్యండి. రఘురాంకి కబురు చేసి అతనిచేత పంపిస్తే తీరిపోతుంది.'

## 4

భార్య ఒత్తిడివల్ల సారంగపాణి నెల రోజులకూ శలవుచీటి రాసి పంపాడు.



రఘురాం తనకు ప్రమోష నొచ్చిందని సంతోషించాడు. యాత్రలకు ఛాన్సు దొరికినందుకు సుందరమ్మ ఉబలాట పడింది.

నాలుగురోజు లయాక సుందరమ్మ, 'ఏమండీ మొదట తిరుపతికి వెడదామా? మా నాన్న చెప్పినట్లు —'

'మీ నాన్న ఏం చెప్పాడు ?'

"'ఆలస్యా దమృతం విషం' అనేవాడు మా నాన్న. 'ఏ పని ఐనా తల పెడితే వెంటనే చేసెయ్యాలి. అలా చెయ్యకపోతే వినాయకుని పెళ్లిలాగ ఆ పని ఎప్పటికీ కావడం అంటూ ఉండదు' అనే వాడు"

'యాత్రకు తప్పకుండా వెడదాం' అన్నాడు సారంగపాణి. 'కాని—'

'ఏమిటో చెప్పండి.'

'ఏం లేదూ. నా కేమిటో అదో మోస్తరుగా ఉంటోంది. ఇంకా రెండు రోజులు విశ్రాంతి తీసుకుని బయల్దేరితే మంచిదేమో. జీతంకూడాచేతిలోపడ్డాక ప్రయాణం చేస్తే సరి. ఏమంటావ్ ?'

'అలాగే చేద్దాం......ఐతే మీకు వంట్లో బాగుండలేదన్నమాట. ఒకసారి డాక్టరుగారితో సంప్రదించరాదూ పోనీ?' అందిసుందరమ్మ. అనడమేకాదు; డాక్టరు జగ్గారావుకి కబురుచేసింది.

డాక్టరురావ్ వచ్చి గుండె వగైరా లన్నీ పరీక్ష చేశాడు.



"మా అబ్బాయి ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాడండి."
"అవునవును, అతన్ని అర్జంటుగా రమ్మని కబురు చేశాను."
"ఉద్యోగం ఇవ్వటాని కేనాండీ."
"కాదుకాదు, ఈ దరఖాస్తు చదివిపెట్టడానికి."

"ఏదీ నోరు తెరవండి...' ఆ!' అనండి."

'ఆఁ!'

'కళ్లుచూస్తా నుండండి—ఊఁ— కొంచెం రక్తం తక్కువగా ఉన్నట్టుంది. అంతే. ఎందుకైనా మంచిది. ఒక టానిక్కు రాసిస్తాను. పుచ్చుకోండి' అన్నాడు డాక్టరు.

'టానిక్కు కేం, పుచ్చుకుంటాను. కాని నాకు అదో మోస్తరుగా ఉంటోంది. విశ్రాంతి తీసుకుంటోంటే తగ్గటానికి బదులు—' అని నీళ్లు నమిలేడు సారంగపాణి.

ఆయన చెప్పబోయిన దేదో వినిపించుకోకుండానే డాక్టరు రావ్ అంతా అర్థమైపోయిందన్న పోజులో 'సారంగపాణిగారూ, గుఱ్ఱానికి స్వారిచేస్తోంటే కలిగేశ్రమ ఉంది చూశారూ, ఆ శ్రమ అంతా జీను విప్పేక కాని తెలీదు. అలాగే మీరు ఊపిరి సలపకుండా మిల్లులో పడ్డశ్రమంతా ఈ విశ్రాంతి సమయంలో పైకి ఉబికి కనపడుతోందన్నమాట. అంతే, అదే తగ్గిపోతుంది. టానిక్కు తీసుకోమన్నానుగా!' అన్నాడు.

## 5

టానిక్కుతీసుకుంటూన్నా సారంగపాణికి ఏమీ నయమైనట్టు లేదు. ఒకనాడు, వంటపని చూసుకుంటూన్న సుందరమ్మ వద్దకు వెళ్లి, "నాకేమిటో అలాగే ఉంటోంది త్రిపురం! ఏదో బాధగా ఉంటోంది! ఇది రక్తపుపోటు కాదుకదా? డాక్ట రేమీ చెప్పలేదూ నీతో? గుండె పీకుతోన్నట్లుంటోంది. పీకడం అంటే కేవలం పీకడం కాదుమళ్లీ. అదేమిటో మరి"అన్నాడు.

'ఉండండి డాక్టరుగారినే అడుగుదాం' అంటూ ఆమె మళ్లీ రావుగారికి కబురు చేసింది.

డాక్టరువచ్చి 'ఏమమ్మా, మీ ఆయన కులాసాయేనా?' అన్నాడు.

'ఏం కులాసా బాబూ? ఆయన వ్యాధి ఏమిటో తెలియకుండా ఉంది,' అన్నది త్రిపురసుందరి.

'ఎందుకూ? ఓ ఇంజక్ష నిస్తాను. దానితో ఏ వ్యాధి ఐనాసరే తగ్గిపోతుంది. ఏడీ ఆయన?' అన్నాడు డాక్టరు.

అంతలో సారంగపాణి కోటు తొడుక్కుంటో తన గదిలోనుంచి వచ్చి, 'త్రిపురం, అలా ఒకసారి మిల్లుదాకా వెళ్లివస్తాను. ఏం లేదు; ఇవాళ జీతా లిస్తారు కదూ, తెచ్చుకొస్తాను.... అరుగో డాక్టరుగారొచ్చారే!' అని ఆయనకు కుర్చీ చూపించాడు.

సుందరమ్మ భర్తతో, 'మీ రిప్పుడు జీతంకోసం పనికట్టుకుని వెళ్లకపోతేనేమండీ? రఘురాంకి కబురు చేస్తేసరి. అతను ఇంటికి తెచ్చియిచ్చి ఆచేవ్రాలేదో చేయించుకు వెడతాడు. డాక్టరుగారి చేత పరీక్ష చేయించుకోండి కూర్చుని.'

"రఘురాం ఇప్పుడే నన్ను పలకరించి వెళ్లేడు. 'నేను జీతాన్ని మిల్లుకి వచ్చి తీసుకుంటాను' అని చెప్పేను. ఓ మాటు అలా వెళ్లివస్తాను. ఇంతకూ ఇప్పుడు మళ్లీ పరీక్ష దేనికి?" అంటూ గుమ్మాలు దిగేడు.

డాక్టరు 'వెళ్లిరానీ వమ్మా పోనీ' అన్నాడు.



'ఎందుచేతనో కాని నాకు ఆయన ఒక్కరూ ఆ మిల్లు దాకా వెళ్లిరావటం అంటే భయంగా ఉందండీ' అంది మెల్లిగా సుందరమ్మ.

'భయ మెందుకమ్మా. పోనీ ఓ పని చేద్దాం. నాక్కూడా ఆ మిల్లులో ఓ చిన్న వ్యవహారం ఉంది. మీ ఆయన జీతం తీసుకునే లోగా నా పనికూడా ముగించుకుని మీ ఆయనతో తిరిగి చక్కావస్తాను. ఆ ఇంజక్షను అప్పుడే ఇస్తాను తాపీగా' అన్నాడు డాక్టరు.

'బాబూ, మీ రెలాగైనా ఉపకారబుద్ధి కలవారు!' అని కృతజ్ఞత కనపరిచిందామె.

'ఆ, ఇందులో పెద్ద ఉపకారానికేముందమ్మా?' అనేసి ఆయన తనలో 'ఏమిటో ఈ సారంగపాణి ఈ మధ్య చాలా మందకొడిగానే ఉంటూన్నాడు. మనిషి చూట్టానికి చాలపుష్టిగానే కనపడుతున్నా మళ్లీని. ఇదేదో మానసికమైన వ్యాధి కాదుకదా' అనుకుంటూ, చురుగ్గా అడుగు వేసి సారంగపాణిని కలుసుకున్నాడు.

## 6

డాక్టరు రావుగారు మిల్లు మేనేజింగు డైరక్టరుతో తన అల్లుని ఉద్యోగం నిమిత్తమై ముచ్చటిస్తోఉండిపోయారు. సారంగపాణి చకచకా పనిచేస్తోన్న యంత్రాలనూ అక్కడి కార్మికులనూ



"ఊఁ, ఇప్పుడు కనుక్కోండి ఎవరో!"

చూసి తన జీతం మాటే మరచిపోయాడు!

"ఏం భద్రయ్యా, క్షేమంగా ఉన్నావా? ఈ చక్రాలకు తగిలించిన 'బెల్టు' చిరిగిపోయినట్టుందోయ్. ఇంక దీన్ని మార్చకపోతే ప్రమాదం కాదూ? —ఏం కామరాజూ, ఇంకా ఈ అరిగిపోయిన 'నట్టు'తోనే కాలక్షేపం చేస్తున్నా వేమిటి?—ఔనుగాని పాపారావ్, ఆ మిషనుకి కాస్త 'గ్రీజు' వెయ్యకపోయినావ్?" ఈ విధంగా ఆయన ఒక్కొక్క కార్మికుణ్ణే పలకరిస్తో ఒక్కొక్క మిషనే పరకాయిస్తో తాను శలవుమీద ఉన్నా నన్నసంగతే మరచిపోయాడు!

డాక్టరురావు వచ్చి, 'సారంగపాణి గారూ, వెడదామా ఇంక ?'

సారంగపాణి పరధ్యానంగా, 'ఎక్కడకి ?'

'ఎక్కడి కేమిటండి ? ఇంటికి. మీ ఆవిడ భోజనానికి కనిపెట్టుకుని ఉంటుంది.'

'ఫరవాలేదు; కాస్సేపు చూసి తినేస్తుంది.'

'మీ భోజనమో మరి ?'

'నా భోజనమా ?—అన్నట్లు నేను భోంచెయ్యకుండా వచ్చాను కాదూ?—ఐనా అంత ఆకలిగా లేదు.'

'మీకు లేదేమో కాని నాకు కరకరలాడుతోంది' అన్నాడు డాక్టరు విసుగ్గా.

'మీ రెందుకూ నా కోసం ఇక్కడ ఆగడం ? పని ఐతే వెళ్లిపోండి.'

'నీకు అంగరక్షకుడుగా వచ్చాను కదుటయ్యా నేను ?'

'అంగరక్షకుడుగా రావడ మేమిటండోయ్ ? నా కేం భయం ?'

రావుకి ఆశ్చర్యం విసుగూ ఎక్కువై, 'నీక్కు అదో మోస్తరుగా ఏదో బాధగా ఉందన్నావు కదుటయ్యా ? అందు కోసం మీ ఆవిడ నిన్ను ఒంటరిగా పంపడానికి భయపడితే నేను నీకూడా వచ్చాను' అన్నాడు.

సారంగపాణి చురుగ్గా, 'ఓ అదా? నిజమే; నేను శలవు పెట్టి ఇంట్లో కూచుంటే ఏదో బాధ అనిపించినమాట వాస్తవమే. కాని ఇక్కడికి వచ్చిన వెంటనే ఈ యంత్రాల సవ్వడి నా చెవులలో పడి ఇంతవరకూ శూన్యమై ఉన్న నా హృదయం,ఆనందంతో నిండి పోయిందండీ!' అన్నాడు. ఆ యంత్రాలను చూపిస్తో, 'వీటి సమిష్టి సంగీతం ఎంత శ్రవణపేయంగా ఉందో!' అంటూ మెచ్చుకో సాగేడు.

'ఈ యంత్రాలరొదనా శ్రవణపేయమైన సంగీతమంటున్నా డీయన! ఈ గందరగోళం తప్పిపోవడం వల్లనా ఈయనకు శలవు సమయంలో మతి పోయినట్టుంట !' అని ఆశ్చర్యపోయాడు డాక్టరు.

